క్లుప్తంగా

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

తెర్లాం: ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షకు సంబంధించి, కోచింగ్(శిక్షణ) కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జె.త్రినాధరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 25వ తేదీ వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఇంతవరకు దరఖాస్తు చేసుకోని, ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఆన్‌లైన్‌లో ఇప్పుడే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మూడు నెలల పాటు శిక్షణతో పాటు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నారన్నారు.

మడ్డువలస నీరందక రైతుల ఆందోళన



గోపింపేట వద్ద నీరు లేని సాగునీటి కాలువ

రేగిడి: మండలంలోని దేవుదళ, లక్ష్మీపురం, గోపింపేట తదితర ప్రాంతాల్లోని రైతులంతా మడ్డువలస రిజర్వాయరు పిల్లకాలువల ద్వారా సాగునీరు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట కోత దశకు చేరి, చివరి తడికోసం ఎదురుచూస్తోందని, ఈ సమయంలో కాలువల ద్వారా నీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెయ్యి ఎకరాలకు పైగా పొలాల్లో వరి సాగు జరుగుతోందని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. తక్షణమే సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామసభల్లో 'ఉపాధి' పనుల గుర్తింపు



మాట్లాడుతున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: గ్రామసభల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు చేపడుతున్నట్లు ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని వండానపేట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, గుళ్లపాడు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించి, ఉపాధి పనుల గుర్తింపు, వాటి నిర్వహణపై చర్చించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించడం జరుగుతుందని, వేతనదారులు, రైతులు కోరిన చోట పనులు చేయిస్తామన్నారు.

పాడిరైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు, ఏజెంట్లు

రాజాం: పాల ధరల తగ్గింపును వ్యతిరేకిస్తూ స్థానిక పట్టణంలోని విశాఖ డెయిరీ ప్రాంతీయ కార్యాలయం వద్ద పాడిరైతులు, ఏజెంట్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. విశాఖ డెయిరీ పాల ధరలు అమాంతం తగ్గించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. పెరిగిన మేత, దాణా ఖర్చుల కారణంగా డెయిరీ ఇస్తున్న పాల ధర గిట్టుబాటు కావడం లేదని, ఈ నేపథ్యంలో ధరలు అకస్మాత్తుగా తగ్గించడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం షాపు తరలించాలని డిమాండ్



రాత్రి సమయంలో కూడా నిరసన కార్యక్రమం కొనసాగిస్తున్న మహిళలు

బొబ్బిలి: పట్టణంలోని మేదరిబంద వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలని అక్కడి మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా ఆరు రోజులుగా నిరసన చేపడుతున్నారు. జనావాసాల వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ద్వారా అనేక ఘోరాలు జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే ఇక్కడి నుంచి షాపును తీసివేయాలన్నారు. మహిళలు నిరసన చేస్తున్న ప్రదేశానికి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు వెళ్లి, సంఘీభావం తెలిపారు.

డీలర్ పోస్టుల ఖాళీలపై ఆరా

వంగర: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లతో తహసీల్దారు దిరిశాల ధర్మరాజు మంగళవారం సమావేశమై డీలర్ పోస్టుల ఖాళీలపై ఆరాతీశారు. అనంతరం పలు సూచనలు చేశారు. నెలవారీ ఇచ్చే రేషన్ సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశంలో సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం చెత్త పని?



ఓ థియేటర్ వద్ద వారం రోజులుగా ఉండిపోయిన చెత్త

చెత్త పన్ను రద్దుపై కూటమి సర్కారుది కపటనాటకమని స్పష్టమవుతోంది. పట్టణాల్లోని ప్రజలపై గత ప్రభుత్వం విధించిన పన్నును రద్దు చేసినట్లు ఓ వైపు చంద్రబాబు ఊదరగొడుతుంటే.. మరోవైపు అదే పన్నును వేరే రూపంలో వసూలుకు రంగం సిద్ధం చేశారు. రాజాం మున్సిపాలిటీలోని వివిధ వ్యాపార సంస్థలు, షాపుల వద్ద ఉండే చెత్తను తీసేందుకు నెలకు కనీసం రూ.వెయ్యి దగ్గర నుంచి రూ.3 వేల వరకు చలానా తీయాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు. రద్దు చేసినట్లే చేసి ఇదేం చెత్త పని అని ప్రభుత్వ తీరును అంతా విమర్శిస్తున్నారు.

- రాజాం మున్సిపాలిటీలో ముమ్మరంగా చెత్త పన్ను వసూళ్లు
- షాపులు, వ్యాపార సంస్థల నుంచి రూ.3 వేల వరకు చలానా
- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే కట్టాల్సిందేనని హుకుం
- లబోదిబోమంటున్న వ్యాపారులు

రాజాం: మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లలో ఉన్న హోటళ్లు, సినిమా థియేటర్లు, వ్యాపార సంస్థలు, షాపుల యజమానులను చెత్త పన్ను వెంటాడుతోంది. ఇదివరకు వారి సంస్థలు, షాపుల వద్ద పోగు అయ్యే చెత్తను పారిశుధ్య కార్మికులతో సేకరించి, తీయించేవారు. ఇప్పుడు అదే చెత్తను తీయాలంటే చెత్త పన్ను తప్పనిసరిగా కట్టాల్సి వస్తోంది. నెలకు రూ.వెయ్యి దగ్గర నుంచి రూ.3 వేలు చలానా కడితే గానీ అక్కడి నుంచి చెత్తను తీసివేయని దుస్థితి. అలా కాకుండా వారానికో పది రోజులుకో అక్కడి నుంచి చెత్తను తీయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. అనధికారికంగా(చలానా తీయకుండా) తీయాలంటే కూడా నెలకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3 వేలకు పైగా షాపులు..

రాజాం పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు మాధవబజార్, శ్రీకాకుళం రోడ్డు, బొబ్బిలి సెంటర్‌లను ఆనుకుని మొత్తం 3 వేలకు పైగా షాపులు ఉన్నాయి. ఆ షాపుల యజమానులంతా చెత్త పన్నుపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. చెత్తను తరలించాలంటే కచ్చితంగా చలానా తీయాల్సిందే.. పన్ను కట్టాల్సిందేనని అంటున్నారని చెబుతున్నారు. గతంలో కన్నా ఇప్పుడు అధికంగా చెత్త పన్ను వసూలు చేసేందుకు పట్టుబడుతున్నారని ఆరోపిస్తున్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏమన్నారంటే..

ఇదే చెత్త పన్ను విషయాన్ని రాజాం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ వద్ద సాక్షి ప్రస్తావించగా, పట్టణంలోని వ్యాపారస్తులంతా చెత్త పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. గతంలో వారు పారిశుధ్య కార్మికులను ఒప్పించి చెత్తను తరలించేవారని, ఇప్పుడు అలా కుదరదన్నారు. పక్కాగా చెత్త పన్ను చెల్లించాల్సిందేనన్నారు.



ఓ వ్యాపార సంస్థ వద్ద డ్రమ్‌లో చెత్తను వేసుకుంటున్న దృశ్యం

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

సంతకవిటి: రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని ఏవో పైల నవీన్ సూచించారు. మండలంలోని తాలాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు. పంటలకు సోకే వివిధ తెగుళ్లు, చీడపీడలపై అవగాహన కల్పించి, నివారణ మందులు సూచించారు. ఎప్పటికప్పుడు మనం వేసుకున్న పంటలను పరిశీలించాలని, ఏదైనా తెగులు సోకినట్లు అనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి, వారి సలహాలు, సూచనలు మేరకు నివారణ మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు లక్ష్మి, అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట, దిబ్బగుడ్డివలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్.. వివిధ పంటలకు సోకే తెగుళ్ల వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

సేంద్రియ ఎరువులతో భూసారం..



బొబ్బిలిరూరల్: అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్

వంగర: సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ అర్నిపల్లి సింహాద్రినాయుడు తెలిపారు. మండలంలోని కింజంగి గ్రామంలో సేంద్రియ ఎరువుల తయారీ, ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతీ రైతు సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు పండించడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలు, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రాజాం: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు రాజు

రాజాం: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని తహసీల్దారు ఎస్‌కే రాజు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన.. గతంలో జరిగిన భూముల రీసర్వేలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అనంత్‌కుమార్, వీఆర్వో అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన కరువైంది. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనలేదు. కార్యక్రమ నిర్వహణపై ప్రచార లోపమో లేక వారికి భూ సమస్యలు లేకపోవడమో తెలియడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, రీసర్వే డీటీ అప్పలనాయుడు, వీఆర్వో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి

రాజాం సిటీ: దురలవాట్లకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎస్‌ఎల్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. చెడు వ్యసనాల బారినపడి ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో ఎక్కువగా యువతే మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారన్నారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.రవికిరణ్, ప్రిన్సిపాల్ పి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

15 రోజులకోసారి శుభ్రం చేయాల్సిందే..

రామభద్రపురం:

ప్రతీ 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శుభ్రం చేయాల్సిందేనని ఎంపీడీవో రత్నం సూచించారు. మండలంలోని పలు గ్రామాలను మంగళవారం సందర్శించిన ఆమె.. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి వనరుల పరిస్థితిని పరిశీలించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, గ్రామస్తులకు తరచూ అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల ప్రాంతాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు చేయాలని తెలిపారు.



బూసాయవలసలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు శుభ్రతను పరిశీలిస్తున్న ఎంపీడీవో రత్నం

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడులలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జీవీ రమణారావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 27వ తేదీన సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలనానంతరం 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



గ్రామదేవతల ఘటాలకు పూజలు చేస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని హరిజన వీధిలో జరుగుతున్న ఆసిరితల్లి, బురదలపోలమ్మ గ్రామదేవతల ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం హాజరై, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా కాచికాపాడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు సింబాల రాము, అల్లెన జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన అక్కడి వారితో సేవలు ఏ విధంగా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సచివాలయంలో సేవలు పూర్తయిన వెంటనే మరో సచివాలయంలో సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు ఉన్నారు.

గుంతల పూడ్చివేత



కాంక్రీట్ వేసి రోడ్డులోని గుంతను పూడ్చివేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని శ్రీకళాభారతి వేదిక దగ్గరలో ఉన్న రోడ్డులో ఏర్పడిన పెద్దగుంతతో పాటు అక్కడక్కడా ఏర్పడిన చిన్నచిన్న గుంతలను మంగళవారం పూడ్చివేశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ఈ పనులు చేయించారు. కాంక్రీట్‌తో గుంతలు కప్పి, సమతలం చేశారు.

ప్రమాదకరంగా వంతెన



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపంలో నాగావళి నదిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా కనిపిస్తోంది. వంతెన రోడ్డులో నెలకొన్న పెద్దపెద్ద గోతుల కారణంగా అటువైపుగా వెళ్లే వాహనదారులు ప్రమాదానికి గురై, చనిపోయే ప్రమాదం కూడా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సత్వరమే అధికారులు అప్రమత్తం కాకపోతే వంతెన కూడా దెబ్బతినవచ్చని అంటున్నారు. వంతెన పక్క గోడలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే ఓటు

రామభద్రపురం: 25 సెంట్ల విస్తీర్ణం కలిగిన సాగు భూమి, పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో ఓటు వేసేందుకు వీలుంటుందని ఎంపీడీవో రత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ రవికుమార్‌తో కలిసి ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో రెండు మధ్య తరహా నీటి సంఘాలు ఉన్నాయని, వాటిలో పెద్దగెడ్డకు సంబంధించి ఐదో నంబరుతో కొట్టక్కి, ఆరో నంబరుతో రామభద్రపురం సంఘాలు ఉన్నాయన్నారు. అలాగే చిన్న తరహా నీటి సంఘాలు మూడు ఉన్నాయని, వాటిలో ఏడొంపులగెడ్డ కోటశిర్లాం, నేరెళ్లగెడ్డ సిస్టం కొట్టక్కి, ఎర్రగెడ్డ కొత్తరేగ సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. పంట కాలువల పరిధిలోని రైతులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని, ప్రస్తుతం ఓటర్ల జాబితా సిద్ధమవుతోందన్నారు. నవంబరు 21 నుంచి 23 తేదీన మధ్య అన్ని సంఘాల్లోని సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం బయట ఎన్నికల షెడ్యూల్ పత్రం ప్రదర్శిస్తున్న ఎంపీడీవో రత్నం, ఇరిగేషన్ ఏఈ

బాడంగి: మండలంలో పాల్తేరు–1, పాల్తేరు–2 చానళ్లతో పాటు తొమ్మిది ఆయకట్టు ప్రాంతాల్లోని నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, ఇరిగేషన్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అదే నోటిఫికేషన్‌ను మండల కేంద్రంలోని రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు గ్రామాల్లోని సచివాలయాల వద్ద ప్రదర్శించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 14 మంది ఎంపిక

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 14 మంది కంటి రోగులను శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి మనోజ్ఞ తెలిపారు. పెరుమాళితో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి 42 మంది కంటి రోగులు శిబిరానికి హాజరు కాగా వారందరికీ ఆప్తాలమిక్ అధికారి వసంతరావు, డాక్టర్ మనోజ్ఞ తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సిన వారిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేష్ పాల్గొన్నారు.



విజయనగరం పుష్పగిరి ఆస్పత్రికి పయనమైన కంటి రోగులు

రైతులను అప్రమత్తం చేయండి

- జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు

తెర్లాం: తుపాను వర్షాల నేపథ్యంలో పంటనష్టం జరగకుండా రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో రేగి రాంబాబు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై, పలు సూచనలు చేశారు. తుపాను కారణంగా ఈ నెల 24వ తేదీ నుంచి వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని, ఎక్కడా ప్రాణనష్టం, ఆస్తినష్టం, పంటనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాలకు వరిపంట దెబ్బతినకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చెరువులు, వాగులు వద్ద గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వరదలకు నీటమునిగే గ్రామాలు ఏవైనా ఉంటే అక్కడి ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తుపాను తగ్గినంత వరకు గ్రామస్థాయి అధికారులంతా వారు పనిచేస్తున్న గ్రామాల్లోనే ఉండి, ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల అధికారులకు ఇవ్వాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: తుపాను నేపథ్యంలో మండల కేంద్రంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో తహసీల్దారు కె.సుధాకర్, ఎంపీడీవో ఎస్.రామకృష్ణులు మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. తుపాను వర్షాల కారణంగా ఎక్కడా ఎటువంటి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పంట నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నదీ తీర గ్రామాల్లోని ప్రజలను నదుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు.

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించారు. తహసీల్దారు ఎం.శ్రీను మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని సూచించారు. వర్షాలకు కూలిపోయే పరిస్థితిలో ఉన్న భవనాలు, వంతెనలు, కానాల వద్దకు ప్రజలను వెళ్లనివ్వొద్దన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.రవికుమార్, పీఆర్ డీఈ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

రాజాం సిటీ: రానున్న తుపాను ప్రభావం దృష్ట్యా మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎస్‌కే రాజు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావులు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశమైన వారు తుపాను కారణంగా ఎక్కడా ఎటువంటి నష్టం సంభవించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

వంగర: వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ కోరారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమైన ఆయన.. తుపాను వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రాణనష్టం, పంటనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాద్, ఏవో టి.కన్నబాబు, వైద్యాధికారి సుష్మితాదయాన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు ప్రతీ విద్యార్థి ఆరోగ్యం తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయాలని, ఉతికిన బట్టలు ధరించాలని, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వేడివేడిగా ఉన్నప్పుడే ఆహారం తినాలని, కాచివడపోసిన నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ అప్పారావు, సీహెచ్‌వో సుందరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.